క్లుప్తంగా

చేడ్వాయిలో 'పోషణ్ పక్వాడా'



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, అధికారులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి అంగన్‌వాడీ –2 కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా ఆధ్వర్యంలో మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీరోజు పోషకాహారం తీసుకోవడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు దినసరి ఆహారంలో రాగులు, సజ్జలు, జొన్నలు, చిరు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. పోషకాహారం లోపం వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం మహిళలతో కలిసి పోషకాహారం వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ ధర్మేందర్

లింగాపూర్: రూ.కోటి 5లక్షల ఉపాధిహామీ నిధులతో మండల కేంద్రంతో పాటు మండలంలోని పిక్లాతండా, గోపాల్‌పూర్, జాముల్‌ధరా గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్ల పనులను పీఆర్ ఏఈ ఆడే ధర్మేందర్ బుధవారం పరిశీలించారు. మాజీ సర్పంచ్ ఈశ్వర్ సుమలత, జెడ్పీటీసీ రక్కాబాయి లక్కా, రమేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.


డయాలసిస్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో గల డయాలసిస్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడ ఖాండ్రే విశాల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రాన్ని, ప్రభుత్వాసుపత్రిని పార్టీ నాయకులతో కలిసి బుధవారం సందర్శించారు. కేంద్రంలో వసతులు మెరుగుపర్చాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంట హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సైదం నాగరాజు, గడ్డల ప్రణయ్, నాయకులు గడ్డల మల్లన్న, సాయి, తిరుపతి, పిడుగు మహేశ్ ఉన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మేనేజర్

వాంకిడి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా కలిగి ఉండి మూడు నెలల క్రితం మృతి చెందిన మండలంలోని గోయెగాం గ్రామానికి చెందిన కనక రంబబాయికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం ద్వారా రూ.2 లక్షలు మంజూరయ్యాయని బ్యాంకు మేనేజర్ నంద కృష్ణ తెలిపారు. ఆమె భర్త కనక కైలాష్‌కు బీమా చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫీల్డ్ ఆఫీసర్ వివేక్, సీఎస్పీ నిర్వాహకుడు భిక్షపతి పాల్గొన్నారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: 317 జీవోలో స్థానికత కోల్పోయిన అందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలని పీఆర్టీయూ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఎదుట జీవో బాధితులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

30వ సారి రక్తదానం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాయిమ్మకు ఏ పాజిటివ్ రక్తం అత్యవసరం కాగా, మండలంలోని భట్‌పల్లి గ్రామానికి చెందిన రాధాకృష్ణ రక్తదానం చేశారు. తాను ఇప్పటివరకు 30 సార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.

పనులు సాగక ప్రజల తిప్పలు

- అర్ధంతరంగా నిలిచిన రోడ్డు పనులు
- కంకర పోసి వదిలేసిన వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



నిలిచిన పోలంపల్లి రోడ్డు పనులు



నిలిచిన లగ్గాం ఎక్స్‌రోడ్డు - పెంచికల్‌పేట్ రోడ్డు పనులు

దహెగాం: మారుమూల గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నా కిందిస్థాయి అధికారుల అలసత్వం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. కొన్ని నెలల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌లు పనులను మధ్యలో నిలిపి వేయడంతో మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభించే సమయంలో ప్రజాప్రతినిధులు త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తారే తప్పా పనుల పురోగతిపై మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రెండేళ్లుగా పెండింగ్‌లోనే..

మండలంలోని పోలంపల్లి గ్రామానికి రెండు సంవత్సరాల క్రితం మంజూరైన బీటీ రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఐటీడీఏ ద్వారా రూ. 2.50 కోట్లతో సుమారు 3 కిలోమీటర్ల వరకు బీటీ నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి. ఆరంభంలో పనులు వేగవంతంగా చేసినా ఆ తర్వాత పనులు మందకొడిగా సాగాయి. రోడ్డు పనుల్లో భాగంగా కంకర పోసి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వర్షాకాలంలో మోకాల్లోతు బురదతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రెండేళ్ల క్రితం ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు చేశారు. వెంటనే పనులు ప్రారంభించినా నేటికీ రోడ్డు పనులు పూర్తి చేయలేదు.

నిలిచిన లగ్గాం –పెంచికల్‌పేట్ రోడ్డు..

మండలంలోని లగ్గాం ఎక్స్‌రోడ్డు నుంచి పెంచికల్‌పేట్ పెద్దవాగు వరకు ఉన్న పాత బీటీ రోడ్డు గుంతలమయంగా మారడంతో రెన్యూవల్ బీటీగా మారుస్తూ గత సంవత్సరం డీఎంఎఫ్‌టీ కింద సుమారు రూ. 60 లక్షలను మంజూరు చేశారు. గత వర్షాకాలంలో పనులు ప్రారంభించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కంకర పోసి వదిలేయడంతో ఆ రోడ్డు కూడా ముందుకు సాగడం లేదు. దీంతో వాహనదారులు కంకర రోడ్డుపై ప్రయాణం చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించక పోవడంతో పనులు ముందుకు సాగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలో నిలిచిన రోడ్లపై దృష్టి సారిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా గత నాలుగు సంవత్సరాల క్రితం కర్జి నుంచి రాంపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా మధ్యలో అటవీ ప్రాంతం ఉండడంతో ఆ రోడ్డు కూడా నిలిచిపోయింది. దీంతో అటువైపు ఉన్న సుమారు ఐదు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిలిచిపోయిన రోడ్లను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని గోండు కొసారా, కోపగూడ, వెల్గి, ఎనోలి, పిప్పర్‌గొంది గ్రామాలలో రూ.21 కోట్ల నిధులతో మంజూరైన బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చూస్తానని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీటీసీ హిర్రె ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచులు తుకారాం, అయ్యుబ్, కిష్టు, మనోహర్, సోనేరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, బీఆర్ఎస్ నాయకులు ఎంగలి రాకేష్, దీపక్ ముండె, శైలేష్, అశోక్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని కొత్త అనుకోడ, పాత అనుకోడ గ్రామాల మధ్య బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా మంజూరైన రూ.76 లక్షల నిధులతో నిర్మించే రోడ్డుతో రెండు గిరిజన గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, నాయకులు దోతుల శ్రీనివాస్, మాన్‌సింగ్, ఐటీడీఏ ఏఈ బద్రొద్దీన్, శేఖర్ పాల్గొన్నారు.

బురదగూడ జీపీ పరిధిలో..

మండలంలోని బురదగూడ గ్రామపంచాయతీలోని రాజీవనగర్ గ్రామంలో ఇటీవల నిర్మించిన సిమెంట్ రోడ్డును బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టగా ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ. 10 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, త్వరలో పనులన్నీ పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌లోయా, రమేష్, మేడి కార్తీక్, దీపక్, తిరుపతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



పెంచికల్‌పేట్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దహెగాం: విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని కాగజ్‌నగర్ సఖి మహిళా సంఘం సభ్యులు అన్నారు. బుధవారం మండలంలోని బీబ్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. సఖి మహిళా సంఘం సభ్యులు, కాగజ్‌నగర్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుర్షిత బేగం, ఉపాధ్యాయులు శ్రీశైలం, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



దహెగాం: పెన్నులు అందజేస్తున్న సభ్యులు

విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు హెచ్ఎం విజయ నిర్మల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు రానున్న వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించి పాఠశాలను జిల్లా స్థాయిలో ఉత్తమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన నాగమణి, శరణ్యలకు జెడ్పీటీసీ సముద్రాల సరిత –రాజన్న దంపతులు ఒక గ్రాము బంగారం బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంఈవో రమేశ్ బాబు, ఎంపీటీసీ రాజన్న, ఉపాధ్యాయులు యాదగిరి, బాషా, శ్రీధర్, నగేశ్, గ్రామస్తులు ఖైరాత్, భాస్కర్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కెరమెరి: మండలంలోని మోడి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఫేర్‌వెల్ డే వేడుకలు ఆకట్టుకున్నాయి. హిందీ, తెలుగు పాటలతో పాటు భక్తి గీతాలు, గోండి పాటలపై చిన్నారులు చేసిన నృత్యాలు భేష్ అనిపించాయి. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. హెచ్‌ఎంలు స్వర్ణలత, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

చింతలమానెపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని కౌటాల సీఐ సాధిక్‌పాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, హెచ్ఎం జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని హెచ్ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పది విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, ఉపాధ్యాయులు రమేశ్, రాంచందర్, శ్యాంరావు, సత్యనారాయణ, సంతోష్, రాజబాబు, రజిత, కవిత, సుమలత, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: గంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన గంగాపూర్ ఎంపీటీసీ హరిత, మాజీ సర్పంచ్ పందర్ల వినోదలు విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ అందజేశారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- ఎంపీపీ పెందోర్ మోతీరాం



మాట్లాడుతున్న ఎంపీపీ పెందోర్ మోతీరాం

కెరమెరి: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను గుర్తించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని, పల్లె పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు మూడేళ్లలో చేపట్టిన ప్రగతిని వివరించారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య మాట్లాడుతూ మండలంలో 7000 జాబ్ కార్డులు ఉన్నప్పటికీ 3100 పని చేస్తున్నాయన్నారు. ప్రతీరోజు 100కు పైగా కూలీలు పని చేయాల్సి ఉండగా 50, 60 మంది పని చేస్తున్నారని తెలిపారు. రోజు కూలి రూ.270 పడాల్సి ఉండగా.. రూ.150 కూడా రావడం లేదన్నారు. ఎండల దృష్ట్యా ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే పనులు చేయాలని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటిని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో ఉన్న అపోహలు పోగొట్టేందుకు కళాజాత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వన్యప్రాణుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎఫ్‌బీవో రామయ్య తెలిపారు. నర్సరీల్లో 12 వేల మొక్కలు ఉన్నాయని కావాల్సిన వారు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వైద్యాధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఒక వైద్యాధికారితో పాటు ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అనంతరం ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీడీవో కృష్ణారావు, ఎంఏవో ఎన్.గోపికాంత్, ఎంపీవో ఎండీ అంజద్ పాషా, పీఆర్ఏఈ స్టీవెన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, ప్రత్యేకాధికారులు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్, స్వర్ణలత, రెవెన్యూ సిబ్బంది సేవంతా, ఎంపీటీసీలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు, భక్తులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలో గల వార్ధా నది ఒడ్డున గల శ్రీ శివసిద్ధి హనుమాన్ మందిరం ఎదుట బుధవారం భక్తిశ్రద్ధలతో సుబ్రమణ్యం స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పురోహితులు సురిపెద్ది రాధాకృష్ణ వేద మంత్రాల నడుమ భక్తుల ప్రత్యేక పూజలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. కార్యక్రమంలో దాతలు రాచర్ల సత్యప్రకాశ్, తంగేడి ప్రవీణ్, అర్చన, అనూష, ఆలయ కమిటీ సభ్యులు ప్రవీణ్, చంపత్, బాపు, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీవో

దహెగాం: పంచాయతీలలో ఇంటి పన్నులు వంద శాతం పూర్తి చేయాలని డీఎల్పీవో సురేశ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు, ఇట్యాల, బొర్లకుంట, కోత్మీర్ గ్రామ పంచాయతీలలో పర్యటించారు. ఇంటి పన్నుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వేసవి కాలం వచ్చినందున గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం వేగవంతంగా కొనసాగాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్ ఉన్నారు.

కుష్ఠు వ్యాధిపై సర్వే



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఖిరిడి, ఇందాని గ్రామాల్లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై సర్వే నిర్వహించారు. కుష్ఠు వ్యాధిని గుర్తించడం, నిర్మూలించడం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి పర్యవేక్షించారు. ఇద్దరు కుష్ఠు వ్యాధి అనుమానితులను గుర్తించి తగు సూచనలు చేశారు. ఈ నెల 24 వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 37 బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి పెందూర్ రవిదాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ మమత, సుచరిత, ఆశ వర్కర్లు లక్ష్మి, కమల, గంగుబాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు సుగుణక్క

రెబ్బెన: లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ గెలుపు కోసం కలిసికట్టుగా పని చేయాలని కాంగ్రెస్ నాయకురాలు సుగుణక్క అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగిరేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ బరిలో తాను ఉంటానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, యూత్ నాయకులు కమల్‌నాథ్ రెడ్డి, చిరంజీవిగౌడ్, హరీష్, తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రెబ్బెన: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీలోని ప్రతీ కార్యకర్త పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని తుంగెడకు చెందిన మాజీ ఉప సర్పంచ్ పూదరి తిరుపతి బుధవారం డీసీసీ అధ్యక్షుడి సమక్ష్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విశ్వ ప్రసాద్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందన్నారు. పూదరి హరీశ్, తిరుపతి, పురుషోత్తం, శివ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సిరికొండ: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వాయిపేట్ సెక్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమల అన్నారు. పోషణ పక్షం వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని మల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తప్పకుండా ముర్రుపాలు పట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అంజలి, ఏఎన్ఎం దేవిక, ఆశ వర్కర్ సునీత పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

ఆదిలాబాద్‌రూరల్: వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న మున్నూరుకాపు కులస్తుల సంక్షేమం, అభివృద్ధికి మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ తాలూకా మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఠల్, శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. మున్నూరుకాపులు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిరంతరం చేసిన పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలి

తాంసి: ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వడ్డాడి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకం కోసం చేపట్టిన జాగ్రత్తలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీని తనిఖీ చేశారు. వారి వెంట ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శి అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల పరిశీలన



పని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీవో ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కూలీలందరు పనికి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏపీవో గోవర్ధన్ సింగ్ ఉన్నారు.